హుషారుగా ఉన్నవేళ - ఓ అడవిలోంచి పెళ్ళి బృందం వా రెక్కిన బస్సు జోరుగా పోతోంది. ఇద్దరు దొంగలు ఆ బస్సుని హైజాక్ చేసి పెళ్ళి బృందాన్ని దోచుకోవాలని ఎత్తు వేశారు. అయితే ఓ గడుసు పాప పెళ్ళి పందిట్లో చేయాలనుకున్న గమ్మత్తుని ఆ బస్సులోనే చేసి, భయంతో గడ్డకట్టుకుపోయిన ఓ సేఠ్‌జీనీ, బస్సు డ్రైవర్‌నీ కరిగించి వెయ్యి, ఏభై రూపాయలు బహుమతిని పొందింది. ఏ మా గమ్మత్తు?

అయితే ఆ ముసలాయన ఘటికుడే "ఎంతసేపు వెళ్తుందని?"

"బస్‌ని ఎవడూ దారి కాసి అడ్డనంతసేపు!"

"వాళ్ళతో మీ కెందుకు. వా ళ్ళేదో కబుర్లలో ఉంటేను." ముసలాయన భార్య మందలించింది.

"పోనీ, అడిగానే అనుకో. అలాంటి తలతిక్క సమాధానమా చెప్తాడు వాడు!" గుర్రు మన్నాడు ముసలాయన.

"మనవడు కదా! వేళాకోళం చేసుంటాడు లెండి."

# ట్వింకిల్... ట్వింకిల్... లిటిల్ స్టార్

## 'రాయంచ'

"జోరుగా హుషారుగా షికారు పోదమా" - అని పాట పాడుకుంటూ పోతున్నట్లు చాలా స్పీడుగా... ఆ నల్లని తారు రోడ్డుమీద పరుగుతీస్తోంది ఆర్.టి.సి. వారి సూపర్ డీలక్స్ బస్.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. అది ఓ జాతీయ రహదారి. ఏ గంటన్నరకో... రెండు గంటలకో కాని ఓ ఊరు కనిపించని రూ టది. ఇంచుమించు అడవి లాంటి ప్రదేశం గుండా ప్రయాణం. బస్‌లోని దీపాలింకా ఆర్పలేదు డ్రైవర్. ఆ వెలుగు బస్ అంత పరచుకుని కిటికీల గుండా రోడ్ కిరువైపులా కూడా పడుతోంది.

బస్‌లో సగానికి పైగా ఓ పెళ్ళివారి బృందం... పెళ్ళికూతురు తరఫువారు. చాలా హుషారుగా జోకులు... కేకలు... మిగతా వాళ్ళు మామూలు ప్రయాణికులు. అప్పుడే జస్ట్ అరగంట క్రితమే... ఓ చిన్నపాటి నగరంలో భోజనాలకు ఆగి, తిరిగి బయలుదేరింది బస్. ప్రయాణీకు లంత భుక్తాయాసంలో ఉన్నారు ఇంచుమించు.

డోర్ నుండి కుడి చేతివేపు సీటర్ నాలుగో సీట్లో కిటికీ వేపుగా కూర్చున్న వినోద్ అప్పటివరకు చదివిన వారపత్రికను మడిచి ఒళ్ళో పెట్టుకుని ఓ సిగరెట్ తీసి వెలిగించాడు.

గుండె నిండుగా పీల్చిన పొగ వదులుతూ... కిటికీ గుండా చీకట్లో నిశ్చలంగా ఉన్న ప్రకృతివేపు చూడసాగాడు.

"బాబూ! మీకు అభ్యంతరం లేకపోతే ఇటువేపు కూర్చుంటారా? నేను కాస్త జారబడి కునుకు తీస్తాను" - అర్థిస్తున్నట్లుగా అడిగాడు పక్కనే కూర్చున్న పూర్ణానందం. పూర్ణానందం... పెళ్ళి బృందంలో ఓ పెద్దమనిషి.

అత నలా అర్థిస్తున్నందుకు కాదనలేకపోయాడు వినోద్. "పోనీలే... వయసు మళ్ళినవాడు... బస్‌కి జారపడి పడుకుంటాడు" - అని అనుకుంటూ సీటు మారాడు వినోద్.

అయితే త నలా సీటు మారడం ఎంత మంచిదయ్యిందో అప్పటికి తెలీదు వినోద్‌కి.

"బాబాయ్! ఆ వీక్లీ ఓసారి అడగరా?" పూర్ణానందాన్ని అడిగింది పెళ్ళి బృందంలోని అమ్మాయి అమల.

వినోద్ మౌనంగా అందించాడు పత్రికని ఆ అమ్మాయికి.

"థాంక్స్!" చిరునవ్వుతో అంది అమల.

తను కూడా చిన్నగా నవ్వి తిరిగి సిగరెట్ పీల్చడంలో మునిగిపోయాడు వినోద్.

"ఇంకా ఎంతసేపు ప్రయాణ ముంటుందిరా వెంకటేశం?" అడిగాడు వెనుక సీటులోని ముసలాయన ఓ కుర్రాడిని.

"బస్ వెళ్ళినంతసేపు!" తాము మంచి హుషారుగా సిన్మా కబుర్లలో ఉంటే డిస్ట్రబ్ చేశాడని అలా చెప్పాడు వెంకటేష్.



### మరో ఇద్దరు

"ఏరా! డబ్బిస్తానన్నాడా?

"ఆడపిల్లను కిడ్నాప్ చెయ్యొద్దురా అంటే విన్నావా! ఇప్పుడు చూడు, ఇంకా ఇద్ద రున్నారు వాళ్ళని కూడా తీసుకుపో అంటున్నాడు."

సిన్ని [పొన్నూరు]

"బస్ వెళ్ళేసరికి తెల్లవారి రెండో... మూడో అవుతుంది. మీరు హాయిగా పడుకోండి బాబాయ్!" పెళ్ళికూతురు పినతండ్రి అయిన రంగనాథం చెప్పాడు.

"ఎక్కడ నిద్ర పడుతుంది వెధవది... బంగారం సింగారం... డబ్బు దస్కంతో, ఆడవాళ్ళతో ప్రయాణం!" నణుక్కున్నాడు ఆ ముసలాయన.

"అబ్బబ్బ! మీతో ఇదే బాధ. మన దగ్గరున్న బంగారం సింగారంల గురించి మీరు టముకు వెయ్యక్కర్లేదు. ఎవడైనా వింటే లేనిపోని ప్రమాదం." చిరాకు పడింది భార్య.

"ఆ... బస్‌లో ఇంతమంది మధ్య ఎవ డేం చెయ్యగలడు?" ఎవడు ఏం చెయ్యగలడో నిజంగా ఊహించగలిగితే ఆ ముసలాయన అక్కడే బస్ ఆపి దిగిపోను.

"మిమ్మల్ని కదపడం నాదే బుద్ధి తక్కువ." చెంపలు వేసుకుంది ముసలాయన భార్య.

"ఆ... సరేలే... నాలుగు చేగోడీలు పడెయ్. నములుకుంటూ కూర్చుంటాను."

"అమ్మమ్మా! నా క్కూడా ఓ నాలు గియ్యవే!" అడిగింది పెళ్ళికూతురు పక్కనే కూర్చున్న ఆరేళ్ళ మానస.

"సరి... బస్‌లోనే ఆ కాస్తా ఖాళీ చేసెయ్యండి. కొంత బరువు తగ్గుతుంది." విసుక్కుంటూ ముసలాయన కో నాలుగు... పాప కో అరడజను ఇచ్చిం దావిడ.

అయితే పాప మానసకు మిగిలినవి రెండే... పెళ్ళికూతురు... ఆ పక్క ఫ్రెండ్స్ లాక్కున్నారు నాలుగు.

మిగిలిన రెండూ తింటూ ఒళ్ళో బొమ్మలతో కాలక్షేపం చేస్తోంది మానస.

ఈ హడావుడి గందరగోళం వింటూ మరో సిగరెట్ వెలిగించాడు వినోద్ - "పరవాలేదు.

ప్రయాణానికి మంచి కాలక్షేపం ఈ పెళ్ళివారి బృందం'' అనుకున్నాడు.

అయితే ఆ పెళ్ళి బృందమే తనకూ, మిగిలిన బస్సులోని ప్రయాణీకులకూ ప్రాణాల మీదకు తెస్తారని వినోద్‌కి తెలీదు.

మరో వక్క త్రీ సీటర్‌లో కిటికీ వారగా కూర్చున్న సేట్ చమన్‌లాల్ పరిస్థితి బితుకు బితుకుగానే ఉంది. అందు క్కారణం అతని దగ్గరున్న బ్రీఫ్ కేస్‌లో యాభైవేల హార్డ్ కాష్ ఉంది. తప్పనిసరై ఈ రాత్రి ప్రయాణం. అసలే చిక్కని చీకటిలో కీకారణ్యం గుండా ప్రయాణం.

బ్రీఫ్ కేస్‌ని మరింతగా గట్టిగా పట్టుకుని సర్దుక్కూర్చున్నాడు చమన్‌లాల్.






# క్షణం పంజరం

ఆచార్య తిరుమల

వృథా అయిపోతున్న కాలం
హృదయ స్పందనల తీరాన కూర్చుని
కన్నీటి చుక్కల్ని
జీవిత సరస్సులో రాలుస్తూ ఉంది!
కరిగిపోయిన క్షణంలో
జరిగిపోయిన అక్షరంలో
చేతులు కడుక్కున్న చరిత్ర
వర్తమానం ముందు కూర్చుని
భవిష్యత్తు ఫలాన్ని త్రుంచుకుంటూ ఉంది!

***

గతాన్ని చూసి గర్వరేఖని
వర్తమానాన్ని చూసి నిరాశామయూఖని
భవితవ్యాన్ని చూసి వేదనా శాఖని
చూపులకు హత్తుకొనే జాతిలో
నీతితో అవినీతి
హింసతో అహింస
రాగంతో ద్వేషం
చెలగాట మాడటంలో వింతేమిటి?
ఆశ మీద కాలూని
ఆకాశాన్ని అందుకోవలసిన యువత
జ్వాలా మాలికల్ని ధరించి
కాలం కన్నీటి చుక్కల్లో మునిగిపోతే -
చరిత్ర కళ్ళల్లో ద్వేషం నగ్నస్నానం చేయదా?
శాంతి పేరుతో ఉన్న ఖడ్గంతో
అశాంతి -
సమాజ వృక్షాన్ని నరకదా?

***

ఎన్ని రోజులు! ఎన్నెన్ని రోజులు!
నిర్వీర్యంగా - నిస్తేజంగా - నిష్కారణంగా
చీకటి కడలిలోకి ప్రవహించి
లీనమైపోతున్నాయి!
అధికారాల్లో మార్పు తప్ప
ప్రజల్లో మార్పు ఎక్కడ?
జీవిత సరస్సులో
కాలం కన్నీటి చుక్కల్లో
సామాన్యుని ప్రతిబింబ మెక్కడ?
సోమరితనంలో మునిగిన మనిషి
మనసులో - మాటలో -
నడకలో - నడతలో -
దరిద్రం తప్ప ఏముంటుంది?
లేచి ఒక్క అడుగు ముందుకు వేసి
కాలాన్ని ఆగ్నేయాస్త్రంగా సంధించు!
ఎగిరిపోతున్న శాంతిని
క్షణం పంజరంలో బంధించు!! ★

అయితే బస్ అంతటినీ కలయజూస్తూ నిశితంగా పరిశీలిస్తున్న వ్యక్తులు ఇద్ద రున్నారు - ఒకరు ముందున, మరొకరు మధ్యలో.

బస్ మంచి వేగంతో దూసుకుపోతోంది. డ్రైవర్ కూడా చాలా హుషారుగా ఉన్నాడు. కండక్టర్ కూడా ఓ సిగరెట్ వెలిగించుకుని రిలా క్సవుతున్నాడు.

డ్రైవర్‌కి దగ్గర్లో ఓ సీట్లో కూర్చున్న వ్యక్తి కొస్త వంగి వెనక్కి చూశాడు. మధ్యలో కూర్చున్న వ్యక్తి చెయ్యి పైకెత్తాడు ఏదో యథాలాపంగా ఎత్తినట్లు.

ముందు సీట్లోని వ్యక్తి కాస్త అటూ ఇటూ చూసి ఠక్కున లేచి డ్రైవర్ వెనగ్గా వెళ్ళి కామ్‌గా పిస్టల్ తీసి డ్రైవర్ కణతల కానించాడు.

ఏదో చల్లగా తగలడంతో... చాలా హుషారుగా బస్ నడుపుతున్న డ్రైవర్ ఉలిక్కిపడి సడన్‌గా బ్రేక్ వేశాడు. ఆ సడన్ బ్రేక్‌కి అప్పుడే కాస్తంత నిద్రలోకి జారుతున్న వాళ్ళు... కాస్త ఫ్రీగా ఉన్నవాళ్ళు దడ దడా మని బస్ సీట్లకు గుద్దుకున్నారు. డ్రైవర్ బ్రేక్ మీంచి కాలు తీసి పక్కకు తిప్పబోయాడు తల.

"తెలివితేటలు ప్రదర్శించడానికి ప్రయత్నించకు, తిన్నగా పోనీ!" చాలా కటువుగా అన్నా డా వ్యక్తి.

ఫ్రంట్ సీట్లోని ఒక రిద్దరు వ్యక్తులు లేవబోయారు. కాని ఇంతలో వెనుకనుంచి పిస్టల్ పేలిన ధ్వని వినిపించి ఠక్కున వెనక్కి చూశారు.

బస్సు మధ్య సీట్లోంచి లేచిన రెండో వ్యక్తి బస్ టాప్‌కి పేల్చిన పిస్టల్ పొగ గక్కుతోంది.

"ఎవరూ ఏ విధమైన చాకచక్యం ప్రదర్శించ యత్నించినా చస్తారు." చాలా కఠినంగా అన్నాడు రెండో వ్యక్తి.

వెనుక సీట్లలో కూర్చున్న పెళ్ళి బృందమంత గగ్గోలు పెట్టసాగింది. ఒకటే అరుపులు... కేకలు... ఏడుపులు. వినోద్‌కి మతి పోయినంత పనయ్యింది.

పిస్టల్ కిటికీ గుండా గాలిలో మరోసారి పేలింది. - "ఎవరూ మాట్లాడవద్దు. ఎవరు మాట్లాడినా... మ రేవిధమైన ప్రయత్నాలు చేసినా నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాం." భయంకరంగా అరిచా డా రెండో వ్యక్తి. అంతే మరుక్షణం నిశ్శబ్దం బస్‌లో.

వినోద్‌కి ఒళ్ళు కుత కుత ఉడికిపోసాగింది. తెగించి ఏం చెయ్యడానికీ వీలుకాని పరిస్థితి... నిస్సహాయస్థితి.

అంతలో ఎదురుగా రోడ్డుకు ఎడమవేపు డౌన్‌కి ఓ మట్టి రోడ్ అడవిలోకి కనిపించింది.

"ఆ రోడ్‌లోకి మళ్ళించు బస్‌ని!" డ్రైవర్‌ని అదుపు చేస్తున్న మొదటి వ్యక్తి హుకుం జారీ చేశాడు. మరుక్షణం బస్ ఆ మట్టి రోడ్ వేపు తిరిగింది.

బస్ కండక్టర్ కూడా కాస్త యువకుడు... తెగింపు ఉన్నవాడు... అతని మనసు కూడా ఈ సంఘటనకు కుత కుత లాడిపోతోంది. కాస్త అటూ ఇటూ చూసి రెండో దుండగుడిపై దూకబోయాడు.

కాని మెరుపుకన్నా వేగంగా అలర్ట్ అయిన ఆ రెండో వ్యక్తి నిర్దాక్షిణ్యంగా పేల్చిన పిస్టల్ గుండు వెంట్రుక వాసి తేడాలో చెవి పక్కగా దూసుకుపోయింది.

"మిస్టర్ కండక్టర్! ముందే హెచ్చరించాను. కమాన్! నీ దగ్గరున్న టిక్కెట్ల కలెక్షన్ బాగ్ ఇలా ఇవ్వు!" అంటూ కండక్టర్ చేతిలోని కాష్ బాగ్ లాక్కున్నాడు.

ఏమీ చెయ్యలేని స్థితిలో సీట్లో కూలబడిపోయాడు కండక్టర్.

"అంత అలర్ట్‌గా ఉన్నారంటే వా ళ్ళెవరో ఆరితేరిన దొంగలే" అనుకున్నాడు వినోద్. బస్‌లోని ప్రతి ఒక్కరి గుండెలూ పీచు పీచు మంటున్నాయి. అందరి ముఖాలూరక్తం లేకుండా పాలిపోయినట్లు అయిపోయాయి.

పెళ్ళి బృందం జనాలలో అయితే ఇంచుమించు చలనమే లేదు. బస్ ఓ రెండు కిలోమీటర్లు మట్టి రోడ్‌మీద వెళ్ళాక ఆపు చేయించాడు డ్రైవర్ దగ్గర ఉన్న మొదటి వ్యక్తి.

అక్కడ చిక్కటి చీకటి... బస్‌లోని లైట్ల వెలుగు తప్ప సుదూర తీరంలో ఎక్కడా వెలుతురు లేదు. చుట్టూ కీచురాళ్ళ రొద. అక్కడ ఏం జరిగినా ఆ రాత్రి సమయంలో ఆదుకునేవారు ఎవ్వరూ లేరు.

మొదటి వ్యక్తి రెండో వ్యక్తికి ఏదో సైగ చేశాడు. రెండో వ్యక్తి కూర్చున్న జనంలోంచి ఒకర్ని లేపి తన సీటు దగ్గరున్న ఓ లెదర్ బాగ్ తీయించి ఒక్కో పాసింజర్ దగ్గరనుండి అన్నీ లూటీ చెయ్యడం ప్రారంభించాడు.

వాచీలు... ఉంగరాలు... డబ్బు... ఏది విలువైన

దుంటే అది. నిర్దాక్షిణ్యంగా ఒలిపించేస్తున్నాడు. ప్రతి మనిషి యాంత్రికంగా... భయం భయంగా వస్తువుల్నీ... డబ్బునీ తీసి ఆ బాగ్‌లో వడేస్తున్నారు.

చమన్‌లాల్ కూడా తన ఒంట్లోని నగలనీ... వాచి, డబ్బుతో సహా వడేశాడు.

"ఆ బ్రీఫ్ కేస్ కూడా ఇటివ్వు షేర్!" కరకుగా అన్నాడు దుండగుడు.

"ఇందులో ఏం లేవ్! నా బట్టలు తప్ప." ఒణికింది షేర్ కంఠం.

"అందులో ఏముందో నాకు తెలీ దనుకోకు షేర్! మర్యాదగా ఇచ్చేస్తే మంచిది" అని లాక్కున్నాడు.

"అయిపోయింది. యాభై వేల రూపాయలు ఒకేసారి పరాధీనమైపోయింది." మనసులోనే మౌనంగా లబోదిబో మన్నాడు షేర్.

పెళ్ళివారి బృందం మరో సీటు దాటితే స్టార్ట్ అవుతుంది. బృందం... బృందమంత నిశ్శబ్దంగా ఏడుస్తున్నారు. కళ్ళంట నీళ్ళు కారిపోతున్నాయి. బయలుదేరింది పెళ్ళికి కదా! ఒకో స్త్రీ ఒంటిమీద కనీసం ఏడెనిమిది తులాలకు తక్కువ కాకుండా ఉంది బంగారం. కష్టార్జితం కొంతమందిది... ఎరువు వేసుకొచ్చినవారు కొంతమంది. కళ్ళముందే అంత నిలువు దోపిడీ అయిపోతుంటే పై ప్రాణాలు పైనే పోతున్నట్లుగా ఉంది.

పెళ్ళికూతురైతే భయంతో బిగుసుకుపోయింది.

వినోద్ కూడా చాలా పరిశీలనగా చూస్తున్నా డా దుండగుడివేపు వాడి ఆట కట్టించే అవకాశ మేమయినా కుదురుతుందా అని... కాని చాలా అలర్ట్‌గా ఉన్నాడు వాడు. అంతవరకు రకరకాల సినిమా కబుర్లు... హీరోయిజాలు ప్రదర్శించిన వెనుక సీటులోని యువకులంత గప్‌చిప్ అయిపోయారు.

అయితే అప్పుడు జరిగిం దో సంఘటన... కనీసం బస్‌లో ఉన్న వా ళ్ళెవరూ ఎంతమాత్రం ఊహించనిది.


మామ్మ ఇచ్చిన చేగోడీలు తినేసి కూర్చున్న మానస హఠాత్తుగా - "అమ్మో... పాము పాము..." అని అరచి సీటుమీదకు కాళ్ళు లాగేసుకుని గజ గజ వణికిపోయింది.

అంతే! "ఏదీ... ఎక్కడ... ఎక్కడ!" అని మానస చుట్టు పక్కల కూర్చున్న వాళ్ళు బెంబేలు పడి లేచిపోయారు.

మౌనంగా మానస చూపించిన వేపు చూసేసరికి రెండు సీట్లకు మధ్య ఉండే ఖాళీ ప్లేస్‌లోంచి జర జర మెరుస్తూ డబ్బూ, బంగారం వసూలు చేస్తున్న దుండగుడివేపే వెళ్తూ కనిపించింది పాము. బస్‌లోని లైట్ల కాంతి పడి తళ తళ మెరుస్తోం దది.

పాము తనవేపు రావడంతో కంగారుపడి దానివేపు పేల్చాడు. కాని అది జస్ట్ మిస్సయింది. పిస్టల్ శబ్దానికి వినోద్ సీటు క్రిందకి మళ్ళింది. గాభరాగా లేచాడు వినోద్! అంతే స్ప్లిట్ సెకెండ్.

ఎవరూ ఊహించని విధంగా... టక్కున ఆ




రెండో దుండగుడ్ని ఒడిసిపట్టుకుని చేతిలోని పిస్టల్ లాక్కున్నాడు.

ఒక్క క్షణం ఏం జరుగుతున్నదీ, ఏం జరిగినదీ అర్థం కాలే దెవ్వరికీ. అర్థమైన ఒక రిద్దరు తెలివైన పాసింజర్లు ఇమీడియట్‌గా వినోద్‌కి సాయం చేశారు.

ఆ దుండగుడి తలకు గురిపెట్టాడు పిస్టల్‌ని వినోద్.

"మర్యాదగా చేతిలోని పిస్టల్ క్రింద పడెయ్!" డ్రైవర్ దగ్గరున్న మొదటి వాడిని కేకేశాడు వినోద్.

అయితే వాడికి కూడా జరిగిన దేమిటో పూర్తిగా బుర్ర కెక్కని అయోమయ స్థితిలో ఉండగానే, ముందున్న ఒక రిద్దరు ప్రయాణీకులు తెగించి వాడి చేతిలోని పిస్టల్ లాక్కుని ఒడిసిపట్టుకున్నారు.

జనాలంత ఒక్కసారిగా హాయిగా ఊపిరి పీల్చారు.

"ఎవరైనా తాళ్ళు గాని, పొడవైన పంచెల లాంటివి గాని ఉంటే ఇవ్వండి. వీళ్ళని కట్టిపడేద్దాం." వినోద్ అన్నాడు.

పొడవైన నేత చీరలు నలుగురైదుగురు ఆడవాళ్ళు తీసిచ్చారు. అయితే కొందరు జనాలు సీట్లు నుంచి కదలడానికి జడుస్తున్నారు - పాము ఎటువేపు పోయిందో తెలియక.

ముందుకు వచ్చిన ప్రయాణికుల సాయంతో వినోద్ వా ళ్ళిద్దర్నీ కట్టిపడేసి, ఓ నలుగురిని కాపలా ఉంచాడు.

ఇక వా ళ్ళిద్దరూ కూడా ఎటువంటి



# సంక్రాంతి సంబరాలు

సంబరాలను పంచ సంక్రాంతి వచ్చింది!
మా పల్లెకై కొత్త అందాలు దెచ్చింది!
తొలి కోడి కూతకే తుళ్ళుతూ వచ్చింది!
మంచు తెరలను తీసి మము పలుకరించింది!
ముంగిళ్ళలో వింత ముగ్గులై వెలసింది!
ముగ్గు నడుమను గొబ్బెమగ తానె కూర్చుంది!
హరిదాసు పాటలో స్వరముగా కలిసింది!
జంగమయ చేతిలో శంఖమై పలికింది!
చలిగాలితో చేరి పులకింత రేపింది!
బాలభానుని పిలిచి పరిహాస మాడింది!
ముద్ద పూబంతులను ముద్దుగా తడిమింది!
చామంతి పూలతో చతురోక్తులాడింది!
గంగిరెద్దుకు సాటిగా గజ్జె కట్టింది!
సన్నాయిలో దాగి చల్లగా పాడింది!
గొబ్బి పాటలలోన కోర్కెలై రగిలింది!
కన్నియల కనులలో కాంతులై మెరిసింది!
వచ్చు పచ్చని చేలపై నాట్యమాడింది!
పైర్లపై బంగారు వన్నెలను పులిమింది!
సరదాలు నేర్పింది! సంబరం పంచింది!
పొంగలిగ పొంగింది! మంగళం ఇచ్చింది!



**ఆర్. వి. చలపతి**

రిస్థితిలోనూ కదలలేరు... ఏవిధమైన రుగుబాటూ అస్సలు చెయ్యలేరు.

ఇక మిగిలిన ఆందోళన, భయమంత కూడా సులోకి ఎలా వచ్చిందో తెలియని ఆ పాము. రించే. అది తన సీటు కిందకు దూరడం నోద్‌కు తెలుసు కాని, అ దక్కడే ఉందో, లేకపోతే సీట్ల క్రింద నుండి మరో వైపు ఎటయినా రిపోయిందో...

"ఇంతకీ అదేం పామో?" బస్‌లో వా ళ్ళెవరో డిగారు.

"నాగుపామేమో! కొంపదీసి." తా తగా రన్నారు ఆపేసిన వేగోడీలు మళ్ళీ తినడం ప్రారంభిస్తూ.

"నాగుపామో, వానపామో... ఏదో ఒకటి. కరిస్తే దో తంటా మళ్ళీ!" రంగనాథం అన్నాడు.

ఇంతవరకూ దొంగల బెడదైతే... ఇప్పుడు ముధి. ఎవరి సీట్లలో వాళ్ళే కూర్చున్నారు. కాళ్ళు డా క్రింద పెట్టడంలేదు. అలా అని క్రిందకు గిపోడానికి అడవి. అ దో భయం.

"ఎవరి దగ్గరైనా టార్చ్ ఉందా? అస లెక్క డుందో పాము చూద్దాం!" అడిగాడు వినోద్.

"ఇదిగో బాబూ టార్చ్!" రంగనాథమే తీ సిచ్చాడు టార్చ్‌లైట్.

టార్చ్ వేసి తన సీటు క్రిందే ముందుగా చూశాడు వినోద్. అతని ఊహ కరెక్టే. ఈ హడావుడికి పాము కదలక, మెదలక తన సీటు కిందే ఉంది. తోక కనపడుతోంది. ఏం చెయ్యడానికీ బోధపడలేదు వినోద్‌కి.

పాము తోక అక్కడ కనపడేసరికి ఆ చుట్టుపక్కల సీట్లలో వాళ్ళు లేచి వెనుక సీట్లకు పారిపోయారు.

అప్పుడు జరిగింది మళ్ళీ అందరూ ఆశ్చర్యపోయే సంఘటన. అంతవరకూ ఆ పక్క సీట్లో కూర్చున్న పాప మానస - "అంకుల్ నేను పట్టేస్తాను పాముని" అని రెప్పపాటులో వచ్చి టక్కున పాము తోక పట్టుకుని లాగింది. అంతే అందరూ గొల్లుమన్నారు.

"అమ్మో! చచ్చిపోయిందే నా కూతురు!" అని ఏడుపు లంకించుకుంది మానస తల్లి.

పెళ్ళి బృందమంత దానికి వంత పలికారు.

బస్‌లోని మిగతా ప్రయాణీకులంతా అవాక్కయి చూస్తున్నారు.

"పాపా!" అని మానస చేతిలోని పాముని ధైర్యం చేసి విదిలించెయ్యబోయాడు వినోద్.

పక పక నవ్వుతూ ఆ పామును రెండు చేతులతోనూ పట్టుకుంది మానస.

"ఇది రబ్బరు పాము అంకుల్! నాదే" అంది ఇంకా నవ్వుతూనే.

ఇంచుమించు బస్‌లో వా రందరూ 'ఆ' అని నిట్టూర్చి ఆశ్చర్యంతో తలమునకలైపోయారు.

వినోద్ ఆశ్చర్యానికి అంతేలేదు.

"అవు నంకుల్! ఈ పాముకి కీ ఇచ్చి నేనే వదిలాను. ఇది తెలీని వా రెవరైనా చూస్తే నిజం పామనే అనుకుంటారు. రేపు పెళ్ళి పందిట్లో దీ న్నొదిలి అందరినీ ఓ ఆట ఆడించుచ్చు కదా అని పట్టుకున్నాను" అంది నవ్వుతూనే పాప.

"మ రిప్పు డెందు కొదిలావే పెంకిముండా!" కసురుకున్నారు తా తగారు.

"నే నిప్పుడు పాము నొదిలాను కాబట్టే ఆ దొంగల్ని పట్టుకోగలిగారు." వినోద్ వేపు చూస్తూ - "ఈ అంకుల్ ఒకటే ఆలోచిస్తుండడం చూసి నేనూ ఆలోచించాను. వెంటనే ఐడియా వచ్చింది. పాముకి కీ ఇచ్చి వదిలాను. ఆ దొంగ గాభరా పడ్డంతో అంకుల్ ధైర్యం చేసి పట్టుకున్నారు." సింపుల్‌గా చెప్పింది మానస.

ఆ పాప అమోఘమైన తెలివితేటలు అందర్నీ ఆశ్చర్యపరిచాయి. అందరూ వచ్చి ఆ పాపను ఎత్తుకుని ముద్దుల్లో ముంచెత్తసాగారు.

బస్ డ్రైవరు గబగబా వచ్చి జేబులోంచి యాభై రూపాయల నోటు తీసి పాప చేతిలో కుక్కి - "ఒస్ నీ, బస్‌లోని ప్రయాణీకుల్ని కూడా నీ అమోఘమైన తెలివితేటలతో కాపాడవు. థాంక్సమ్మా!" అని వెళ్ళి బస్ స్టార్ట్ చేశాడు.

షేర్ చమన్‌లాల్ అయితే - "జీతే రహో బేటీ... జగదంబా నిన్ను చల్లగా చూడాల" అని ఓ వెయ్యి రూపాయల కట్ట పాప చేతి కిచ్చాడు.

"వ ద్దంకుల్" అని తిరస్కరించింది మానస.

"నాది ఏభై వేలు సొమ్ము కాపాడావ్. పరవాలేదు ఉంచుకోమ్మా!" పాపను ముద్దాడి వెళ్ళిపోయాడు షేర్.

"ఆ దొంగనాయా ళ్ళిద్దర్నీ జాగ్రత్తగా చూడండి. వచ్చే స్టేజీలో పోలీస్ స్టేషన్‌కి అప్పచెబుదాం" అని బస్‌ని మెయిన్ రోడ్ ఎక్కించి గమ్యంవేపు పరుగు తీయించాడు డ్రైవర్.

ఎవరి సీట్లలో వాళ్ళు మళ్ళీ సర్దుకు కూర్చున్నారు. పాప మానసను దగ్గరకు తీసుకుని అనిర్వచనీయమైన ప్రేమతో నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు వినోద్. ఆ పాప సమయస్ఫూర్తికి మనసులోనే జోహారు లర్పించాడు. అతని కో ఇంగ్లీష్ రైమ్ గుర్తు కొచ్చింది.

"ట్వింకిల్... ట్వింకిల్... లిటిల్ స్టార్
హౌ ఐ వండర్ వాట్ యు ఆర్..."

బస్ హాపీగా ముందుకు పరుగులు తీస్తోంది. ★